# ప్రేమ లేఖలు

రమణారావు చాలా చిత్రమైన మనిషి, అతనితో నాకు మూడేళ్ళ పరిచయం ఉంది. ఈ మూడేళ్ళలోనూ అతని మనస్తత్వం గురించి నాకు తెలిసింది కొంచెంకూడా లేదు. రమణారావు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో ఎవ్వరూ చెప్పలేరు. ఎప్పుడూ ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు ఉంటాడు. అప్పుడప్పుడూ చాల సరదాగా కూడా ఉంటాడు - కాని అది ఎంతోసేపు ఉండదు. నవ్వుతూ మాట్లాడుతూ ఉన్నట్లుండి ముఖం తీవ్రంగా మార్చేస్తాడు. అతనితో జోక్ చెయ్యాలన్నా నాకు భయం... ఒక్కోసారి జోక్‌ని చాల తేలిగ్గా తీసుకుంటాడు గానీ ఒక్కోసారి ముఖం చాల సీరియస్‌గా పెడ్తాడు. అతను ఎక్కువ ఎవ్వరితోనూ కలవడుకూడా...అతనికి నేనొక్కడినే స్నేహితుడినేమో!...

మొదటిసారి రమణారావు ప్రేమలేఖలు చూపించినప్పుడు నేను చాల ఆశ్చర్యపోయాను. అవి ఎవరో ఇద్దరు అమ్మాయిలు అతనికి రాసిన ప్రేమ లేఖలు.

"మీరు నాకు స్నేహితులు గాబట్టి మీదగ్గర ఏమీ దాచకూడదు...అందుకనే మీకు అంతా చెప్పేస్తున్నాను...ఇదిగో ...ఈ ఉత్తరాలు చదవండి...మీకే తెలుస్తుంది'' అంటూ ఇవ్వబోయాడు.

"అబ్బే...ఎందుకు లెండి... మీరు చెప్పండిచాలు" అంటే అతను వినలేదు. ఏమైనా సరే...నేనా ఉత్తరాలు చదవాల్సిందేనని పట్టుబట్టాడు.

"ఉత్తరాలన్నీ ఓపిగ్గా చదివాను. ఆ ఉత్తరాలనుబట్టి అవి రాసిన అమ్మాయిలు ఎవరో రమణారావును గాఢంగా కాంక్షిస్తున్నారని తెలుస్తూంది. "నువ్వంటే పడిచస్తాను...నువ్వు లేందే బ్రతకలేను..." అంటూ రాశారు వాళ్ళిద్దరూ.

ఒకమ్మాయి ఒకబ్బాయిని ప్రేమించినా ఒకబ్బాయి ఒకమ్మాయిని ప్రేమించినా అంత ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. కాని నేను ఆశ్చర్యపడడానికి మాత్రం కారణం ఉంది- అది రమణారావు రూపమే...

రమణారావు కలల్లోకి వచ్చేంత అందగాడు కాదు కానీ అతన్ని పగలుచూస్తే రాత్రి కలలోకి తప్పకుండా వస్తాడు. మనిషికూడా ఏమంత ఆరోగ్యవంతుడు కాదు. కానీ ఏవిషయంలోనైనా పేరు ప్రఖ్యాతులున్నవాడా అంటే అదీలేదు...మరి ఆ అమ్మాయిలు ఏం చూసి అతన్ని ప్రేమిస్తున్నట్టు?...ఆ మెల్ల కళ్ళ సుబ్బారావును పిల్లి కళ్ళ శారద, నల్ల కమలని తెల్ల గోపాలం ప్రేమించడం లేదూ?...అట్లాగే ఇది కూడా అని సరిపెట్టుకున్నాను.

ఒకరోజు నేను శంకరం మాట్లాడుతుంటే ఛట్లానా మధ్యలో రమణారావుగురించి ఏదో విషయం వచ్చింది.

"ఏమిటీ?...రమణారావా??...పాపం పూర్ ఫెలో" అన్నాడు శంకరం.

నేను ఆశ్చర్యపోయాను.

"రమణారావు నీకు తెలుసా?"

అతనిగురించి తెలియకపోవడం ఏమిటి గురూ...అతను ఆఫీసులో మా సెక్షనులో ఒక సంవత్సరంపాటు పనిచేశాడు. ఇప్పుడు వేరే సెక్షనుకు మారిపోయాడు."

రమణారావు గురించి శంకరం చెప్పిన విషయాలు చాల ఉత్సుకత కలిగించేవిగా ఉన్నాయి.

రమణారావే వాళ్ళింట్లో అందరికంటె పెద్దపిల్లవాడు. రమణారావు తరువాత మరో అబ్బాయి ఇంకో అమ్మాయి ఉన్నారు. ఇంటిలో అందరికీ, వాళ్ళ అమ్మకూ, నాన్నకూ, తాతయ్యకూ, నాయనమ్మకూ అందరికీ రమణారావు తమ్ముడంటేనే ఎంతో ముద్దు...వాడు చాలా అందంగా కూడా ఉంటాడు. రమణారావుతో ఇంటిలో అందరూ పరాయిపిల్లవాడిలా ప్రవర్తించేవారు. రమణారావు ఏదైనా తప్పుపనిచేస్తే వాళ్ళమ్మ కయ్‌మని పైకి లేచేది. వాళ్ళ నాన్న అతన్ని పట్టుకుని చితకబాదేవాడు. అదే తప్పుగనక అతని తమ్ముడు చేస్తే పోనీలెద్దూ...పాపం కుర్రవెధవ వాడికేం తెలుసు అని ఊరుకునేవారు. రమణారావుకు అతని తమ్ముడికి వయసులో రెండేళ్ళు మాత్రమే తేడా!

ఆవిధంగా అందరికీ దూరంగా ఉండే తత్వం రమణారావులో ఏర్పడింది. అతను కాలేజీలో చదువుతూ ఉండగా ఒక అమ్మాయిని ప్రేమించాడుకూడా. ఒకనాడు ధైర్యంచేసి ఆఅమ్మాయికి తన ప్రేమను తెలియజేసి పెళ్ళిచేసుకుంటాను అని చెప్పాడు.

ఆమె గట్టిగా నవ్వి "నేను...నిన్ను పెళ్ళి చేసుకుంటానని ఎలా అనుకున్నావ్?" అంది.

రమణారావు జీవితంలో మొదటిసారి ప్రేమించిన మనిషి ఆమె...పాపం...అందుకనే అతను అప్పటిలో చాల కృంగిపోయాడు. కాలేజీ చదువులయిపోయిన తరువాత ఓ చిన్న ఉద్యోగంలో చేరాడు.

ఒకసారి రమణారావుకు పెళ్ళి సంబంధంవస్తే ఇతను వెళ్ళి అమ్మాయిని చూచివచ్చి నచ్చినట్లు చెప్పాడు. ఇంటిలో అందరికీ అమ్మాయి నచ్చింది...వాళ్ళు కూడా రమణారావు సంబంధం చెయ్యడానికి యిష్టపడ్డారు. కట్న కానుకల దగ్గరకూడా పేచీ ఏమీ రాలేదు. సంబంధం కుదిరినట్టే అని అందరూ అనుకున్నారు...కానీ ఈ సంబంధం తనకు యిష్టం లేదనీ తన మాట వినకుండా తనకి పెళ్ళి చేస్తే ఉరోసుకుని చస్తానని ఆఅమ్మాయి గోలచెయ్యడంతో ఆ సంబంధం తప్పిపోయింది. అప్పటినుండి రమణారావు మళ్ళీ పెళ్ళి చూపులకంటూ వెళ్ళలేదు.

"అతను ప్రేమకోసం మొహం వాచిపోయి ఉన్నాడు... అందుకనే పాపం అతను అదో మాదిరిగా ఉంటాడు" అన్నాడు శంకరం నిట్టూరుస్తూ.

"ఇప్పుడు అతనికి అవసరమైన ప్రేమ లభ్యమైందిలే..." అంటూ రమణారావుకు అమ్మాయిల దగ్గరనుండి వచ్చే ప్రేమలేఖల విషయం చెప్పాను.

నేను చెప్పిన విషయం విని శంకరం ఆశ్చర్యపోయాడు. నేను స్వయంగా అతనికి వచ్చిన ప్రేమలేఖలు చూశానని చెప్పే వరకూ శంకరం ఒకపట్టాన నమ్మలేదు.

రమణారావు అప్పుడప్పుడూ నన్ను కలుస్తూ తనకు వచ్చే ప్రేమలేఖలు గురించి చెపుతూనే ఉన్నాడు మొదట వాకు చెప్పిన అమ్మాయిలే కాక ఇప్పుడు ఇంకా ఎవరెవరి దగ్గర నుండో కూడా ఉత్తరాలు వస్తున్నట్లు చెపుతున్నాడు. అతను చెప్పే విషయాలు నేను నమ్మకపోయి ఉండేవాడనే... కాని ఒకరోజు నేను వాళ్ళింటిదగ్గర ఉన్నప్పుడు పోస్టులో ఒక ప్రేమ లేఖ రావడమూ దాన్ని నేను చూడటమూ జరిగింది. ఇక వమ్మకుండా ఎలా ఉండగలను?... నాకీమధ్య రమణారావు వశీకరణ శక్తిలాంటిది ఏదైనా సాధించాడేమోనని ఒక అను మానం మనసులో పీకుతూ ఉంది.

ఆరోజు ఆదివారం! ఇంటిదగ్గర ఏమీ తోచక రమణా రావు యింటికి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి రమణారావు ఏదో ఉత్తరం రాసి కవరుమీద అడ్రసు రాస్తున్నాడు. నన్ను చూడగానే కవరు చటుక్కున టేబులు సొరుగుతీసి అందులో పడేసి

"హలో... రావుగారా?... రండి రండి" అంటూ ఆహ్వానించాడు.

ఇద్దరం కాసేపు కూర్చుని ఆమాటా ఈమాటా చెప్పు కున్నాం.

"ఏదైనా పిక్చర్ కి వెళదామండీ... బోర్ కొడుతుంది" అన్నాను నేను.

"అవును... నాక్కూడా అలా బయటికి ఎక్కడికైనా వెళదామని ఇందాకటినుండీ అనిపిస్తుంది... ఒక్క నిముషం

ఆగండి... ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చేస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు.

ఇందాకటినుండీ నా మనసంతా అతను నేను వచ్చినప్పుడు రాస్తున్న ఉత్తరంమీదనే ఉంది. నేను వచ్చినప్పుడు అతను టేబులు సొరుగు తెరిచి తొట్రుపాటుతో ఉత్తరాన్ని అందులో పడెయ్యడమే నా కుతూహలానికి కారణం.

అది తప్పకుండా ప్రేమలేఖ అయి ఉండాలి!... రమణారావు ఇంతకీ ఏ అమ్మాయికి ఉత్తరం వ్రాస్తున్నాడో తెలుసుకోవాలని నాకు అనిపించింది తనకు ఉత్తరాలు వ్రాస్తున్న అమ్మాయిల్లో అతను ఏ అమ్మాయిని ఎన్నుకున్నట్టు?...

నా కుతూహలాన్ని అణుచుకోలేక పోయాను....ఆ కవరుమీది చిరునామా చూసినంతమాత్రాన తప్పేమీ లేదుగా?...

చటుక్కున సొరుగుతీసి రమణారావు వ్రాసిన ఉత్తరం తీసాను. కవరుమీద అతని అడ్రసే ఉంది. నా ఆశ్చర్యానికి అంతులేదు.

కవరు అంటించి లేదు?... తప్పే అయినా కుతూహలం అణుచుకోలేక కవరులోని కాగితం చూశాను. అందులో రమణారావుకు ఎవరో అమ్మాయి ప్రేమలేఖ రాసినట్టుఉంది. ఇదివరకు రమణారావు చూపించిన ప్రేమలేఖలో ఇటువంటి చేతివ్రాత ఉన్నవి రెండుమూడు చూశాను. ఆ టేబులు సొరుగులో ఇంకా రెండుమూడు రకాల చేతివ్రాతల్లో అమ్మాయిల పేర్లతో ప్రేమలేఖలు ఉన్నాయి.

అన్నీ ఇంకా పోస్టుచెయ్యాల్సినవి!...

అన్నీ రమణారావుకి అందాల్సినవి! !...

సెప్టెంబరు, 1975, యువ